## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌల్దారం, జూన్8: మండలడలోని అంసాని పల్లి గ్రామానికి చెందిన బొమ్మ దుర్గాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అతడికి శస్త్ర చికిత్స నిమి త్తం మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మా రెడ్డి ఆదివారం నగరంలోని మాదాపూర్‌లో గల తన నివాస గృహం లో బాధిత కుటుంబ సభ్యులకు అందజే శారు. ఈ కార్యక్రమంలో అంసానిపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్, నరేం దర్ రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి



.పూజలందుకుంటున్న అమ్మవారు, క్యూలో భక్తులు

పాపన్నపేట, జూన్8: వనదుర్గా భవానీ క్షేత్రంలో దుర్గమ్మకు జనహారతి పట్టారు. వేస వి సెలవులు కావడంతో భక్తులు భారీగా తర లివచ్చారు. మంజీరా నదిలోని పాయల్లో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నా రు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకు మార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పిం చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం బ్రహ్మాచారి, బత్తిని రాజు, నర్సింహులు, వరు ణాచారి, నరేశ్, దీపక్ ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థీవ శర్మ, రాము శర్మ, నాగరాజు శర్మ పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తన సిబ్బందితో తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.


## ముగిసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 8: నెల రోజు లుగా జిల్లా కేంద్రంలోని ఓపెన్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యం లో కొనసాగిన సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఆదివా రం ముగిసింది. క్యాంపులో పాల్గొన్న క్రీడా కారులకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యద ర్శి మహేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు శివశంకర్‌రావు, జిల్లా ఆథ్లెటిక్స్ అ సోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు సర్టిఫికెట్లు అందజేశారు. కోచ్ అరవిం ద్, ఫిజికల్ ట్రైనర్ మోహన్‌రాజ్, సభ్యు లు కొండ శ్రీనివాస్, అర్జున్, సలీం పాల్గొన్నారు.

## తునికి నల్లపోచమ్మను దర్శించుకున్న మేడ్చల్ జడ్జి



అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్జి

కౌడిపల్లి, జూన్8: అమ్మదయతో ప్రజలంతా సుఖశాంతులతో బాగుండాలని కోరుకున్నట్లు మేడ్చల్ కోర్టు జడ్జి అర్జున్, ఎన్ఐఏ అధికారి విశాల్ గౌతమ్ తెలిపారు. ఆదివారం తునికి నల్లపోచమ్మ అమ్మవారిని కుటుంబ సమేతం గా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆ లయ ఈవో రంగారావు పూర్ణకుంభంతో స్వా గతం పలికారు. అనంతరం ఆలయ చరిత్ర ను, ఆచారాలను అడిగితెలుసుకున్నారు. వా రి వెంట కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి, కోర్టు సి బ్బంది దిలీప్, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి ఉన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆర్ఎంపీ ఆత్మహత్య



బర్రె మహేశ్ (ఫైల్)

చేగుంట, జూన్8: ఆర్థిక ఇబ్బందులతో ఆర్ ఎంపీ ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం పోతాన్‌పల్లిలో జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్రె మహేశ్(30) గ్రామంలో ఆర్ఎంపీగా పనిచే స్తున్నాడు. మూడేండ్ల క్రితం వివాహమైంది. ప్రైవేటు ఫైనాన్స్‌లు, స్నేహితులు, బంధువుల వద్ద సుమారు రూ.13లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు తీర్చలేక శనివారం రాత్రి మ నస్తాపంచెంది ఇంటి నుంచి వెళ్లి పోయా డు. పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహ త్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తూప్రాన్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విష మించడంతో హైదరాబాద్ గాంధీ దవాఖా నకు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్ మృతిచెందాడు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నటు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## వ్యవసాయంలో మెళకువలతో అధిక లాభాలు



గంధారిపల్లిలో రైతులకు అవగాహన

పాపన్నపేట, జూన్ 8: రైతులు సాగులో మెళ కువలు పాటించి, అధిక లాభాలు పొందా లని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. విక సిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గంధారి పల్లిలో రైతులకు వానకాలం పంటలపై అవ గాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. అధిక దిగు బడి ఇచ్చే వరి రకాలు, విత్తన శుద్ధి, ఎరువుల వాడకంపై పలు సూచనలు చేశారు. శాస్త్రవే త్తలు రవి, రమేశ్, దాసు, చిన్నబాబు, ఏఈవో జనార్దన్ పాల్గొన్నారు.

## 25ఏండ్లకు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శివ్వంపేట, జూన్8: పిల్లుట్ల జడ్పీహెచ్ఎస్‌లో 2000-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు లింగాపూర్ గ్రామంలోని ఓ గార్డెన్‌లో సిల్వర్ జూబ్లి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులకు సన్మానించారు. మెమోంటోలు అందజేశారు. చదువుకునే రోజుల్లో జరిగిన అనుభవాలను, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

## గాలివానతో నేలకొరిగిన రేకుల షెడ్డు



కౌడిపల్లి, జూన్8: శనివారం రాత్రి ఈదురు గాలుల తో కూడిన వర్షానికి రాయిలాపూర్ తండాలోని నునా వత్ రాజుకు చెందిన మల్బరి షెడ్డు నేలకొరిగింది. దీంతో 2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

## ప్రభుత్వ దవాఖానల బలోపేతానికి కృషి



రోగుల గదులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



అక్కన్నపేటలో చౌకధరల దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- సిబ్బంది సమయపాలన పాటించాలి
- రామాయంపేటలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తాం: కలెక్టర్ రాహుల్ రాజ్
- రామాయంపేట సీహెచ్‌సీ, డీ.ధర్మారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

రామాయంపేట, జూన్8: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీహెచ్‌సీ, డీ.ధర్మారంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. దవాఖానలో రోగులను వివరాలు తెలు సుకున్నారు. ప్రజలకు సత్వర సేవలు అందేందుకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలోనే రామాయంపేట సీహెచ్‌సీలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. డీ.ధర్మారంలోని పీహెచ్‌సీని సందర్శిం చారు. రోగుల గదులు, రికార్డులు పరిశీలించారు. అనంతరం మండ లంలోని అక్కన్నపేటలో చౌకధరల దుకాణాన్ని సందర్శించి పలు సూచ నలు చేశారు.

## మృగశిర కార్తెకు జోరుగా చేపల విక్రయాలు



చేపలు కొంటున్న విక్రయదారులు



మార్కెట్‌లో బంగారు తీగ, బొచ్చ చేపలు



ఎల్లమ్మ ఆలయంలో భక్తుల పూజలు



మెదక్‌లో చేపల మార్కెట్

రామాయంపేట, జూన్8: మృగశిర కార్తె సందర్భంగా చేపల విక్రయాలు జోరందుకు న్నాయి. ఆదివారం రామాయంపేటలోని చేపల మార్కెట్‌లో ప్రజలు చేపలు కొన్నారు. చేపల ధరలు సైతం అమాంతంగా పెంచే శారు. మార్కెట్‌లో కొర్రమీను రూ.300 ఉంటే మృగశిర సందర్భంగా కిలో రూ.500 చొప్పున విక్రయించారు. బొచ్చ, రహు చేపలు రూ.100 నుంచి రూ.200లకు కిలో చొప్పున అమ్మారు. పలు ఆలయాలలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్,జూన్ 8: మృగశిర కార్తె పురస్కరిం చుకొన్ని మండలంలో ఆయా గ్రామాల్లో చేప ల కొనుగోలు జోరుగా కొనసాగాయి.మండ లంలో మెరిగె,బొచ్చె, పాపెర, బు డ్డబర్క, బంగారు తీగ, మొట్ట వంటి చేపలు ఎక్కువగా అమ్ముకున్నారు. ఈ చేపలకు కిలో రూ.250 నుంచి,రూ.400ల వరకు పలికాయి.

### మెదక్‌లో..

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 8: మృగశిరకార్తె ప్రవేశిస్తున్న సమయంలో చేపలు తింటే పలు రోగాలు నయమవుతాయనే నమ్మకం అనా దిగా వస్తున్నది. దీంతో మెదక్ చేపల మార్కెట్‌లో విక్రయాలు జోరుగా సాగా యి. బొచ్చ, బంగారు తీగ తదితర చేపలు రూ.250కు పైగా ధర పలికాయి. 500 పలికే కొరమీను 800లకు కిలో చొప్పున అమ్ముడు పోయాయి.

### ఊరూరా పెద్దమ్మ ఆలయాలు



పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

తూప్రాన్, జూన్ 8: రాష్ట్రంలో ఊరూరా పెద్దమ్మ తల్లి ఆలయాల నిర్మాణాలు జరు గుతున్నాయని శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్ అన్నారు. గుండ్రెడ్డిప ల్లిలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



మహోత్సవంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు

### సబ్సిడీపై జీలుగ విత్తనాలు

అల్లాదుర్గం, జూన్ 8: రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నా యని ఏవో రాజేశ్ ప్రకటనలో తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సోమవారం అల్లాదుర్గంలోని రైతువేదిక వద్దకు రావాలన్నారు. 30 కేజీల బస్తా రూ,4275 ఉండగా 50శాతం సబ్సిడీపై రూ,2137.50 ఇస్తున్నట్లు తెలిపారు.

### బాధిత కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ ఆర్థికసాయం



శివ్వంపేట, జూన్ 8: మండలంలోని దొంతి గ్రామానికి చెందిన వంజరి సాయమ్మ అనా రోగ్యంతో బాధపడుతున్నది. ఆమెకు రూ.5వేల నగదు, అల్లీపూర్ గ్రామానికి చెందిన మంజుల, ముత్యాల కూతురు పవిత్ర వివాహానికి పుస్తెమెట్టెలను మాజీ జడ్పీటీసీ పబ్బుమహేశ్‌గుప్తా ఆదివారం అందజేశారు. ఆయన వెంట గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఉపస ర్పంచ్ కొదాస్ సత్యనారాయణ, తాళ్ల రఘుగౌడ్, రామకృష్ణాగౌడ్, శ్రీనివాస్, సత్తయ్య ఉన్నారు.

## కొనసాగుతున్న బడిబాట



పాపన్నపేటలో ఇంటింటి ప్రచారం



చిలిపిచెడ్:జగ్గంపేటలో బడిబాట

పాపన్నపేట/చిలిపిచెడ్, జూన్8: పాపన్నపే టలో ఆదివారం ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు బడిబాటలో భాగంగా ఇంటింటా ప్ర చారం చేశారు. విద్యార్థులు ప్రభుత్వ బడు లకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నా రు. సంస్థానాధీషుల కోట ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. చిలిపిచెడ్ మండలంలోని జగ్గంపేటలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పోచయ్య ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

## చేగుంటలో పట్టపగలు చోరీ



బీరువాను ధ్వంసం చేసి చిందరవందరగా పడివేన బట్టలు

చేగుంట, జూన్8: చేగుంటలో పట్టపగలు చో రీ జరిగిన ఘటనలో నగదు, బంగారం, వెం డి వస్తువులను అప హరించుకు పోయినట్లు చేగుంట పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన చిట్టబోయిన ఆంజనేయులు హమాలీ కాలనీలో నివా సం ఉంటున్నాడు. ఉదయం తాళం వేసి బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. సాయంత్రం వచ్చే వరకు తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అందులోని వివిధ రకాల బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. బాధి తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హోంలోన్ ఆశచూపి.. కుచ్చుటోపి

### రూ.45,720 కాజేసిన సైబర్ మోసగాళ్లు

శివ్వంపేట, జూన్ 8: హోంలోన్ ఆశచూసి ఓ వ్యక్తి డబ్బులు కాజేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధు కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన కట్ట మీది శ్రీకాంత్‌కు ఏప్రిల్ 25న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇన్‌స్టంట్ పర్సనల్‌లోన్ నుంచి మాట్లాడుతున్నామన్నాడు. హోం లోన్ రూ.10 లక్షలు ఇస్తామని చెప్పాడు. సరేనని, తీసుకుంటానని శ్రీకాంత్ చెప్పాడు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేసి సేవింగ్ అకౌంట్ ఉంటే లోన్ రాదని, కరెంట్ అకౌంట్ ఉండా లని, రూ.16,850 కట్టాలని చెప్పాడు. దీంతో శ్రీకాంత్ ఫోన్‌పే చేశాడు. మరోసారి ఫోన్ చేసి ఎన్‌వోసీకి రూ.10వేలు చెల్లించాల నడంతో 26న ఫోన్‌పే చేశాడు. మరోసారి ఫోన్ చేసి నెఫ్ట్ చార్జ్ కోసం రూ.10వేలు కట్టా లని చెప్పగా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఓటీపీ వస్తుంది దానికోసం రూ.8870 చెల్లిం చాలని చెప్పడంతో అనుమానం వచ్చిన శ్రీకాంత్ సైబర్‌క్రైం 1930కు కాల్ చేశాడు. ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.45720 కట్టిం చుకుని, తనను మోసం చేశారని ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాపన్నపేట,జూన్ 8: 21ఏండ్ల తరువాత ఒక చోట చదివిన విద్యార్థులు కలుసుకు న్నారు. 2003-04లో పదో తరగతి పూర్తి చేసుకున్న మిత్రులందరూ ఆదివారం కుర్తి వాడ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చదువుకునే సమయంలో జరిగిన అనుభూ తులను తోటి మిత్రులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులు బాలకిష్టయ్య, శంకర్, సీతారాం, మధుసూదన్‌ను సత్కరించారు.

## గుండెపోటుతో యువకుడి మృతి

పాపన్నపేట, జూన్8: బక్రీద్ పండుగ రోజు మైనార్టీ యువకుడు గుండె పోటుతో మరణించిన ఘటన పాపన్నపేటలో శనివారం రాత్రి జరి గింది. గ్రామానికి చెందిన ముజాహిద్దీన్ అలీ(40) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బక్రీద్ జరుపుకోవడా నికి కుటుంబ సభ్యులు, అక్కాచెల్లెల్లతో కలిసి పాపన్నపేటకు వచ్చాడు. శనివారం ఉదయం కొంత అస్వస్థతకు గురికాగా స్థానిక దవాఖానలో చికిత్స పొందాడు. ఆపై పొద్దంతా బక్రీద్ వేడుకల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపాడు. రాత్రి కాగానే తీవ్రమైన గుండెపో టుతో మృతిచెందాడు. కుటుంబీకులు వెంటనే మెదక్ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతు డికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ముజాహిద్దీన్ అలీ మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

### - నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, జూన్8: ప్రభుత్వ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని నారాయ ణఖేడ్ మాజీ ఎమ్మె ల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పేర్కొన్నా రు. ఆదివారం నారాయణఖేడ్ క్యాం పు కార్యాయలంలో సీఎం రిలీఫ్‌ఫం డ్ చెక్కులు అందజేశారు. పెద్దశంకరం పేట మండలం టెంకటి గ్రామానికి చెందిన జింక కాశీరామ్‌కు రూ.27 వేలు, నిజాంపేట మండలం నాడదర్ గ్రామానికి చెందిన చిన్న నాయకుని బాలయ్యకు రూ.60 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోనం అంజయ్య, గోవింద్, అడివప్ప, సాయిలు, రాంగొండ, నారాగౌడ్, రాజు తది తరులున్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



రామాయంపేట, జూన్8: ప్రభుత్వ కళా శాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని, ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లేశం తెలిపారు. ఆదివారం మండలంలో ని కోనాపూర్, అక్కన్నపేట, డీ.ధర్మారం గ్రా మాల్లో విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అధ్యాప కులు బాబురావు, అశోక్‌గౌడ్ ఉన్నారు.

## పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మోహన్‌నాయక్

రామాయంపేట, జూన్8: రామాయంపేట లో అనారోగ్యంతో మృతి చెందిన చేపూరి దు ర్గయ్య కుటుంబానికి సంఘ సేవకుడు మో హన్‌నాయక్ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. పట్టణం లోని 9వ వార్డుకు చెందిన మృతుడు దాకి భీమయ్య(50) కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు అందించారు. మల్లేశం, సురేశ్‌నాయక్, కుమార్, సాయి ఉన్నారు.

### పుస్తెమట్టెలు అందజేత

నిజాంపేట, జూన్8: నిజాంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జెడ్చెరువు తండాకు చెందిన అఖిల వివాహానికి లీలా గ్రూప్ చైర్మన్ మోహ న్‌నాయక్ హాజరై పుస్తెమట్టెలు అందజేశారు.

## మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్8: మెదక్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రాంగణం యేసయ్య నామస్మర ణలతో హోరెత్తింది. గంట గంటకు చేసిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకు న్నారు. చర్చి ప్రేసిబేటరీ ఇన్ చార్జి శాంతయ్య, పాస్టర్లు దైవసం దేశం వినిపించారు. భక్తులు వసతి గృహాలు లభించక చెట్ల కిందే వంట వార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, నోబుల్‌సన్, జాన్సన్, సంశాన్ సందీప్, పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో ఉపాధి హామీపై గ్రామసభ



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

నిజాంపేట, జూన్8: నిజాంపేట పంచాయతీ కార్యాలయంలో ఉపాధి పనులపై అధికా రులు ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల వివ రాలతో పాటు ఆదాయ వివరాలను గ్రామస భలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగాపై ప్రజలకు, దుకాణదారులకు అవగాహన



రామాయంపేట, జూన్8: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను పుర స్కరించుకుని రామాయంపేటలోని ఇంటిం టికి, దుకాణాదారుల వద్దకు వెళ్లి ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షకుడు మద్దెల భరత్ ఆదివారం అవగాహన కల్పించారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్న కార్మికులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 8: పరిసరాల శు భ్రత తప్పసరిగా పాటించాలని మెదక్ మున్సి పల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూ చించారు. వంద రోజుల ప్రణాళికలో భాగం గా ఆదివారం 7వ వార్డులో ఇంటింటికెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇంట్లోని చెత్తను ఎట్టి పరిస్థితుల్లో బయట వేయరాదని, మున్సిపల్ చెత్త వాహనంలో వేయాలని కమిషనర్ సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే పరసరాలు అశుభ్రంగా మారి, రో గాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వార్డులోని మురుగు కాల్వలు శుభ్రపరిచి పిచ్చి మొక్కలను తొలిగించారు. కార్యక్రమం లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీకొని హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు



చేగుంట, జూన్8: రెండు కార్లు ఢీకొని హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలైన ఘటన మండలం లోని వడియారం బైపాస్ వై జంక్ష న్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబు ల్‌గా పనిచేస్తున్న కిషన్‌నాయక్ కారును మరో కారు వడియారం బైపాస్ వై జంక్షన్ వద్ద ఢీకొనడంతో కిషన్‌నాయక్‌కు గాయాల య్యాయి. దీంతో దవాఖానకు తరలించారు.